క్లుప్తంగా

అయ్యప్ప మాల ధరించిన జెడ్పీ చైర్‌పర్సన్


అయ్యప్పస్వామి మాల ధరించిన బూచేపల్లి వెంకాయమ్మతో బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆదివారం చీమకుర్తిలోని సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి మాల ధరించారు. కుమారుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో పాటు కుటుంబ సభ్యుల సమక్షంలో వెంకాయమ్మతో పాటు మనుమడు తేజేశ్వరరెడ్డి అయ్యప్పస్వామి మాల ధరించారు. బూచేపల్లి వెంకాయమ్మ అయ్యప్పస్వామి మాలను గత 28 సంవత్సరాలుగా ధరిస్తూ వస్తున్నారు.

బాలిక అదృశ్యం

ఒంగోలు టౌన్: నగర శివారులో ఓ బాలిక అదృశ్యమైంది. కొప్పోలులోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన దంపతులకు ఇంటి వద్ద టీ స్టాల్ ఉంది. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తె 8వ తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటోంది. శనివారం రాత్రి నుంచి తమ కుమార్తె కనిపించడం లేదని తలిదండ్రులు స్థానిక టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, అదే కాలనీకి చెందిన చిలుకా రవీంద్ర అనే యువకుడితో ఇటీవల ఆమెకు పరిచయమైందని, ప్రేమ పేరుతో అతడు చెప్పిన మాయమాటలు నమ్మి అతడితో వెళ్లి ఉంటుందని భావిస్తున్నారు. కాగా, గతంలో ఇదే బాలిక విషయంలో రవీంద్రపై ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఈ కేసులో రిమాండ్‌కు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు. మళ్లీ అదే బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లినట్లు భావిస్తున్నారు.

కాకతీయ సేవాసమితి నూతన కమిటీ ఎన్నిక

కంభం: కాకతీయ సేవాసమితి గిద్దలూరు నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం కంభంలో బైరపనేని అధ్యక్షతన ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావూరి వెంకటసుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడిగా పోకా చిన్న ఈశ్వరయ్య, కార్యదర్శిగా బోయపాటి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా కర్నం లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా ఇప్పర్ల వెంకట సత్యనారాయణ, కోశాధికారిగా కర్నం బాలకోటయ్య, మరికొందరు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ నెల 24న ఆదివారం కంభం చెరువుకట్టపై కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేయనున్నట్లు నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

అనాథాశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పీఆర్ కాలనీలో ఉన్న సంజీవని అనాథ వృద్ధాశ్రమానికి ఎల్‌ఐసీ ఏజెంట్ కోట సత్యనారాయణ ఆర్థిక సహకారంతో నిత్యావసర వస్తువులను ఆదివారం స్థానిక సీఐ కె.సురేష్ చేతులమీదుగా అందజేశారు. సీఐ మాట్లాడుతూ.. ఆశ్రమంలోని ఒంటరి వృద్ధులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఎదుటి వారికి సహాయం చేయాలనే మంచి ఆలోచన చేసినందుకు సత్యనారాయణను ప్రత్యేకంగా అభినంధించారు. తన వంతుగా అనాథశ్రమానికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆశ్రమం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎల్‌ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఆశ్రమ నిర్వాహకులు రాజశేఖర్, ఇండియన్ టింబర్ డిపో యజమాని పసుపులేటి శ్రీనివాసులు, ఎస్సై ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

స్వాములకు చద్ది ప్రారంభం

పొదిలి: అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక నిర్మమహేశ్వర స్వామి దేవస్థానంలో చద్ది కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. మాలధారణ భక్తులకు దాతల సహకారంతో 50 రోజులపాటు చద్ది ఏర్పాటు చేస్తున్నట్లు గురుస్వాములు యక్కలి శేషగిరిరావు, అప్పల శంకర్ తెలిపారు. హైదరాబాద్‌లో రియల్టర్ నరసింహారెడ్డి రూ.లక్ష, క్లాస్ వన్ కాంట్రాక్టర్ కామసాని రామిరెడ్డి రూ.50 వేలు విరాళంగా ఇచ్చారని వెల్లడించారు. మల్లంపాటి ఆదిరెడ్డి మంచినీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల తనయుడు విష్ణుష్‌రెడ్డి, పూజారులు మురళీకృష్ణమాచార్యులు, వాసు, గురుస్వాములు గంజి సుబ్బారావు, కొండయ్య, కాటూరి ప్రసాద్, వెంకటరావు, కాటూరి నారాయణ ప్రతాప్, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఉభయదాతలు సోమిశెట్టి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు మేళతాళాలతో ఆహ్వానించారు. ఆలయ పూజారులు పూజలు, హోమాలు చేయించారు.

రోడ్లన్నీ మావే..!

- ఒంగోలు నగరంలో రోడ్లపైనే తిష్టవేస్తున్న పశువులు
- ఇష్టానుసారం వదిలేస్తున్న వాటి పోషకులు
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు
- రాత్రివేళ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు


ట్రంకురోడ్డు నుంచి అన్నవరప్పాడు వెళ్లే మలుపులో రోడ్డుపై అడ్డంగా పడుకుని ఉన్న పశువులు

ఒంగోలు అర్బన్:

నగరంలోని పలు రోడ్లపై పశువులు తిష్ట వేస్తున్నాయి. ఈ రోడ్లన్నీ మావే అన్నట్టుగా దర్జాగా పడుకుని ఉంటున్నాయి. నగరంలో నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై సైతం పశువులు, ఆవుల మందలు తిరుగుతున్నాయి. రాత్రివేళ పడుకుని ఉంటుండటంతో ఎదుటి వాహనాల లైటింగ్‌కు పూర్తిగా దగ్గరకు వచ్చేంత వరకూ నల్లటి పశువులు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. పశుపోషకులతో మాట్లాడి పశువులు రోడ్లపైకి రాకుండా నియంత్రించడంలో నగరపాలక సంస్థ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారుగానీ.. ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. నగరంలోని రోడ్లపై పశువులు కనిపిస్తే వాటిని తీసుకెళ్లి బందెల దొడ్డిలో ఉంచుతామని, యజమానులకు జరిమానాలు విధిస్తామని ఇటీవల కూడా కమిషనర్ ప్రకటించారు. కానీ, ఆచరణ గాలికొదిలేశారు. పశువులను వాటి పోషకులు ఇష్టానుసారం రోడ్లపైకి వదిలేస్తూనే ఉన్నారు. అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో రోడ్లపై వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. పలు సందర్భాల్లో రోడ్లపై పశువుల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. స్థానిక కోర్టు సెంటర్, శివాలయం సెంటర్, భాగ్యనగర్, ట్రంకు రోడ్డు, తదితర ప్రాంతాల్లో పశువులు యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతూ ట్రాఫిక్‌కు, వాహనదారులకు అంతరాయం కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి రోడ్లపై తిరిగే పశువులను నియంత్రించి వాహనదారుల కష్టాలు తీర్చాలని నగరవాసులు కోరుతున్నారు.

అగ్ని అస్త్రంతో పురుగు నివారణ


అగ్ని అస్త్రం తయారీ విధానాన్ని రైతులకు వివరిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

మడనూరు (కొత్తపట్నం): అగ్ని అస్త్రంతో పురుగును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి పిట్టు వెంకటేశ్వరరెడ్డి సూచించారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం విభాగం ఆధ్వర్యంలో మడనూరులో రైతులకు అగ్ని అస్త్రం తయారు చేయడాన్ని ఆదివారం నేర్పించారు. ఆవు పేడ, వేపాకు, అల్లం పేస్ట్, పచ్చిమిర్చి పేస్ట్, వెల్లుల్లి పేస్ట్, పొగాకు మరిగించి 48 గంటలు చల్లార్చాలని, దానిని వడపోసి పైరుకు పిచికారీ చేసుకోవచ్చని వెంకటేశ్వరరెడ్డి వివరించారు. ముఖ్యంగా వరిలో వచ్చే కాండం తొలిచే పురుగు, కాయలు తొలిచే పురుగులను నివారించవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో అగ్రిస్తం తయారు చేసుకోవడమే కాకుండా అధిక దిగుబడులు కూడా వస్తాయన్నారు. వీటితో పండించే పంటలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా వేరుశనగ, కూరగాయలు, వరి, ఆకుకూరలు అన్ని రకాల పంటల్లో పురుగు నివారణకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. 250 లీటర్ల అగ్ని అస్త్రం తయారు చేసి రైతులకు చూపించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ నరసింహులు, ఐసీఆర్‌పీ రెహమాన్ బాషా, వికాస్‌రెడ్డి, మనోహర్, కాశింబీ పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల అందజేత


విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీమకుర్తి: చీమకుర్తి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆదివారం సైకిళ్లు అందించారు. గోనుగుంట, గాడిపర్తివారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లలో చదువుతున్న ఐదుగురు విద్యార్థినులకు సైకిళ్లు అందించారు. ఇంటి నుంచి హైస్కూలుకు రాకపోకలకు సౌకర్యార్థం వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వ్యవస్థాపకుడు చెరుకూరి రఘుకిరణ్, అధ్యక్ష, కార్యదర్శులు కడవా రామకృష్ణ, కేవీ సుధాకర్, పోకూరి రామకృష్ణారెడ్డి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, పీపీ వీరానారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆకాశ దీపాలు


కేశవస్వామిపేటలో ఆకాశ దీపాలు వెలిగిస్తున్న అర్చకులు, భక్తులు


శ్రీగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో...

ఒంగోలు మెట్రో: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం నగరంలోని శైవక్షేత్రాల్లో శివునికి ప్రాతఃకాలమున పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్థానిక లాయర్‌పేట, కేశవస్వామిపేటలోని కాశీ విశ్వనాథుని దేవస్థానాలలో, ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో, ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ ధ్వజస్తంభానికి అర్చకులు భక్తిశ్రద్ధలతో ఆకాశ దీపాలు వెలిగించారు. లాయరుపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా వెలసి ఉన్న మరకత శివ లింగానికి, కేశవస్వామిపేటలోని కాశీవిశ్వనాథుని దేవాలయంలో, రంగారాయుడు చెరువు దగ్గర అరుణాచలేశ్వరస్వామికి, అంజయ్యరోడ్డులోని సాయిశివ పంచముఖ క్షేత్రంలో, కొత్తపట్నం బస్టాండ్ శివాలయంలో, మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్లో హరిహరసుత అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంగా వెలసియున్న కాశీవిశ్వనాథునికి, బాలాజీరావుపేటలోని దుర్గామల్లేశ్వరస్వామికి, గాంధీనగర్లో రామలింగేశ్వరస్వామికి, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న కాశీవిశ్వనాథునికి, సమతానగర్లోని సాగర్ కాల్వ దగ్గర దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

1,590 మందికి ఉచిత వైద్య సేవలు


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

ఒంగోలు టౌన్: నగరంలోని సంతపేటలో గల టీటీడీ కళ్యాణ మండపంలో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరంలో 1,590 మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. ప్రతి ఒక్కరికీ కేవలం రూ.200కే రెండు నెలలకు సరిపడా మందులు అందించారు. తక్కువ ధరకు ఇన్సులిన్లు పంపిణీ చేసినట్లు క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. వైద్యం ఖరీదైపోయిన ఈ రోజుల్లో పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతి రెండు నెలలకోసారి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ శిబిరంలో 140 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా పాల్గొని ప్రజలకు సేవలందించారన్నారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు బి.హరిబాబు, ఎల్.జాన్ రిచర్డ్, చాపల వంశీకృష్ణ, ధీరజ్‌బాబు, సందీప్ ప్రకాశ్, ఎం.శరత్‌బాబు, రవితేజ, కొల్లా భారతి, సమీర్, సుధాకర్‌బాబు పాల్గొని వైద్య సేవలు అందించారు.

జంగమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన


కార్యక్రమంలో పాల్గొన్న జంగమ సంఘ నాయకులు

ఒంగోలు మెట్రో: జంగమ సంఘం అభివృద్ధి కమిటీ, ఒంగోలు పట్టణ కమిటీ, ప్రకాశం జిల్లా జంగమ సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు వేమూరి కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం సామూహికంగా కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముందుగా శివలింగానికి రుద్రాభిషేకం, బిల్వదళార్చన పూజా క్రతువులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం పదో తరగతి, ఇంటర్మీడియట్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో బాలబాలికలు ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులను, విద్యార్థులను ఉద్దేశించిన మోటివేషన్ స్పీచ్ అందరినీ ఆలోచింపజేసింది. ప్రకాశం జిల్లా జంగం సంఘం ఆధ్వర్యంలో ఉచిత జంగమ వివాహ పరిచయ వేదిక నిర్వహించగా, వివాహం కాని వారు ఉచితంగా రిజిస్టర్ చేసుకున్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, యల్లసిరి మల్లికార్జునరావు, మసునూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సంతనూతలపాడు వాసవీ క్లబ్‌లకు అవార్డులు


అవార్డులు అందుకుంటున్న వాసవీ క్లబ్ సంతనూతలపాడు సభ్యులు

సంతనూతలపాడు: సంతనూతలపాడు వాసవీ క్లబ్, మహిళా క్లబ్‌లకు ఒంగోలు వైశ్య భవన్లో ఆదివారం జరిగిన రీజినల్ కాన్ఫరెన్స్‌లో ఉత్తమ పురస్కారాలు లభించాయి. రీజియన్లో గల పది వాసవీ క్లబ్బులకు సంబంధించి సంతనూతలపాడు వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్ చేస్తున్న సేవలకు అవార్డులు దక్కాయి. వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ రంగస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంతనూతలపాడు వాసవీ క్లబ్ అధ్యక్షుడు వేమూరి వెంకట శేషారావు, వాసవీ మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతిలకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కే హరిప్రసాద్ ఉత్తమ సేవా పురస్కార పత్రాలు అందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సెక్రటరీ చలువాది రాము, కోశాధికారి పి.సుధాకర్, వాసవీ మహిళా క్లబ్ సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ, కోశాధికారి జి.శ్రీలక్ష్మి, వాసవీ మహిళా క్లబ్ ప్రతినిధులు పి.సునీత, జి.సులోచన, తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ సేవా పురస్కార అవార్డు లభించినందుకు వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్ ప్రతినిధులను జిల్లా వాసవీ క్లబ్ ప్రతినిధులు వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, జీఎల్ ప్రసాదరావు, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు జి.శరత్‌బాబు, జిల్లా ఆర్యవైశ్య సంఘ జాయింట్ సెక్రటరీ చక్కా సుబ్బారాయుడు, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

వాసవీ మాతకు సారె సమర్పణ


లలితా పారాయణంలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: యమద్వితీయ పండుగ సందర్భంగా ఆదివారం ఉదయం స్థానిక గాంధీరోడ్డులోని గీతామందిర భక్త బృందం అమలనాథునివారివీధిలో కొలువై ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరీదేవికి చీర సారె, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు సమర్పించారు. ముందుగా గీతా మందిరంలో శ్రీకృష్ణ పరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి గీతా శ్లోకాలు పటిస్తూ గాంధీ రోడ్డు, దక్షిణం బజారు, పప్పు బజార్ మీదుగా వాసవీ దేవస్థానానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించి అన్నా చెల్లెల పండుగను ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అష్టోత్తర సహస్రనామార్చన, మంత్రపుష్పం, మహా హారతి సమర్పించారు. మహిళలు అందరూ కలిసి సామూహికంగా విష్ణు సహస్రనామస్తోత్రం, లలితా సహస్రనామ స్తోత్రాలను పఠించారు. అనంతరం ప్రసాదవితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చక స్వామి ప్రతిభానంద సరస్వతి మాతాజీ, దోగిపర్తి సుబ్రహ్మణ్యం, రాజరాజేశ్వరి, కే కృష్ణ, కొప్పు రావూరి సురేఖ, దేసు అరుణ, ఉపేంద్ర, అనిత, చీమకుర్తి శివప్రసాద్, భారతి, హేమకేష్, గుర్రం రాజేష్ తదితర గీతా మందిర భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.


మద్యానికి డబ్బు ఇవ్వలేదని స్నేహితుడిపై దాడి

ఒంగోలు టౌన్: మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదన్న కోపంతో స్నేహితుడిపై దాడిచేసిన సంఘటన ఆదివారం ఒంగోలు నగరంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని మామిడిపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాసం ఉండే జమ్ములమూడి నాగవర్ధన్ ఒక ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీ రాత్రి 12 గంటల తర్వాత భార్య సౌమ్యరాణిని బెంగళూరు బస్సు ఎక్కించాడు. ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా, మార్గం మధ్యలో కొత్త మార్కెట్ మెయిన్ గేటు దగ్గరకు వచ్చేసరికి ఒంగోలు బండ్లమిట్టకు చెందిన చింపిరి బాలసాయిచంద్, గోపాల్‌నగర్‌కు చెందిన ప్రభుకుమార్, మామిడిపాలెంకు చెందిన రెబ్బవరపు మనోజ్, సత్యనారాయణపురంకు చెందిన వడ్రాణం సూర్య ఎదురుపడ్డారు. వీరంతా స్నేహితులే కావడంతో మద్యం సేవిద్దామని పిలిచారు. నాగవర్ధన్ కూడా వారితో కలిసి మద్యం సేవించేందుకు వెళ్లాడు. ఐదుగురు స్నేహితులూ కలిసి కొత్త కూరగాయల మార్కెట్ మెయిన్ గేటు లోపల వైపు కూర్చుని మద్యం సేవించారు. అనంతరం తనకు ఇంకా మద్యం సేవించాలని ఉందని, ఏమైనా డబ్బులుంటే ఇవ్వమని సాయిచంద్, ప్రభు అడిగారు. తన వద్ద డబ్బులు లేవంటూ సమాధానం చెప్పాడు నాగవర్ధన్. డబ్బులు ఇవ్వమంటే లేవంటావా అంటూ అతడి చొక్కా జేబులు, ప్యాంటు జేబులు వెతకడం మొదలుపెట్టారు. అడ్డుకున్న అతడి మీద దాడి చేశారు. పగిలిన బీరు సీసా తీసుకుని మొహం, నడుం వద్ద పొడిచి కులం పేరుతో దూషించారు. తీవ్రగాయాలతో నాగవర్ధన్ స్పృహతప్పి పడిపోయాడు. దాంతో భయపడిపోయిన వారిద్దరూ పారిపోయారు. అనంతరం నాగవర్ధన్‌ను మనోజ్, సూర్యలు 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల్లో ప్రభుకుమార్ అనే వ్యక్తి గతంలో మూత్రంపోసిన కేసులో ఉన్నట్లు సమాచారం.

రేషన్ దుకాణం తనిఖీ

సంతనూతలపాడు: స్థానిక వడ్డెపాలెంలో 6వ నంబర్ రేషన్ షాపును ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశి, తదితరులు ఆదివారం తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో నిల్వలను, ఎండీయూ వాహనంలో స్టాకును రికార్డుల ప్రకారం పరిశీలించారు. స్టాకు సక్రమంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. రికార్డుల ప్రకారం రేషన్ దుకాణంలో 15 బస్తాల రేషన్ బియ్యం, ఎండీయూ వాహనంలో 10 కేజీలు తక్కువగా పది బస్తాల బియ్యం ఉన్నట్టు తెలిపారు. స్టాకు సక్రమంగానే ఉందని వంశి తెలిపారు.

విద్యార్థుల విజయానికి కవిత్వం దోహదం


కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చిరంజీవి, తదితరులు

ఒంగోలు మెట్రో: ప్రొఫెసర్ పీహెచ్‌జీ కృష్ణంరాజు (రాజు మాస్టర్) రచించిన సేజ్ రిఫ్లెక్షన్స్ ఇంగ్లిష కవితా సంపుటిని శర్మ కళాశాల ఇంగ్లిష్ రిటైర్డ్ లెక్చరర్ వి.చిరంజీవి ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక హర్షిణి డిగ్రీ కాలేజీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ అధ్యక్షత వహించారు. విద్యార్థులకు మనోధైర్యాన్నిచ్చి వారు విజయాల తీరాలకు చేరే అనేక విషయాలను ఈ కవిత్వం ప్రతిబింబిస్తుందని చిరంజీవి అన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు వ్యాఖ్యానంతో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, శ్రీ సత్య కేబుల్ ఎండీ చుండూరి రవిబాబు, ప్రముఖ సాహితీ విశ్లేషకుడు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నవ్యాంధ్ర రచయితల సంఘ గౌరవాధ్యక్షురాలు టి.అరుణ, మాంటిస్సోరి స్కూల్ కరస్పాండెంట్ పి.ప్రకాష్‌బాబు, ఏపీఐసీ సెక్రటరీ సాంబశివరాజు, సుంకర సాయిబాబా, ప్రగతిమెడికల్స్‌రామయ్య తదితరులు పాల్గొన్నారు. పుస్తక రచయిత రాజు మాస్టర్‌ని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ తరఫున ఘనంగా సత్కరించారు.

ఘనంగా తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి వార్షికోత్సవం


క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న యూత్ సభ్యులు

మార్కాపురం: పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చి 27వ సంఘ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన జి.బ్రెనాల్డ్ వాక్య సందేశం అందించారు. క్రీస్తు బోధనలు అనుసరిస్తే సమాజంలో శాంతి, సౌభాగ్యాలు విలసిల్లుతాయన్నారు. తోటివారి పట్ల ప్రేమ, దయ, కరుణ చూపాలని, దాన ధర్మాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. సండే స్కూల్ విద్యార్థుల నృత్య రూపకాలు, యువత ఆలపించిన పాటలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. చర్చి పెద్దలను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దేవరకొండ సామ్యేలు, ఉపాధ్యక్షులు విడుదల కిరణ్, కోశాధికారి సి.రామస్వామి, సంఘ పాస్టర్ పులుకూరి అమృత్‌తేజ్, సభ్యులు పోలయ్య, ఆర్థర్, సతీష్, సుజాత, విజయకుమారి, ప్రదీప్, శరణ్‌కుమార్, సండే స్కూల్ సూపరింటెండెంట్ గంగాభవాని, యూత్ డైరెక్టర్ డి.సౌమ్య తదితరులు పాల్గొన్నారు.